

వాల్మీకులకు పెద్ద పీట

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వాల్మీకుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి ఆదిమూలపు సురేష్ కొనియాడారు.

- 8లో..



రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34.1/26.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా నవంబర్ 4, 5 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో విశ్వేశ్వరరావు తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రత్యేక క్యాంపుల్లో కొత్త ఓటరు నమోదుతో పాటు డబుల్ ఓట్ల తొలగింపు, ఓటర్ చిరునామా మార్పు, ఆధార్ అనుసంధానం కోసం అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. శుక్రవారం విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చన్నారు. కార్యక్రమంలో ఒంగోలు తహసీల్దారు మురళి, ఎంపీడీవో అజిత, ఓఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఏసీపీ వెంకటేశ్వర్లు, డీటీ రఫీ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

తరల్ మిడ్‌లైన్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

ఒంగోలు: నవంబర్ నెలలో నిర్వహించనున్న తరల్ మిడ్‌లైన్ పరీక్షలకు 3, 4, 5 తరగతుల విద్యార్థులను సన్నద్ధం చేయాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక పెళ్లూరులోని ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. తెలుగు సబ్జెక్టులో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల వర్క్‌బుక్స్ పరిశీలించిన అనంతరం తేదీతో సంతకం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తరల్ బేస్‌లైన్ టెస్టు ఫలితాలను పరిశీలించారు. విద్యాకమిటీ చైర్మన్‌తో కలిసి విద్యార్థుల నమోదు పెంపుదలకు కృషిచేయాలని కోరారు. జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించడంతో పాటు రుచి చూశారు. ప్రతిరోజూ సాయంత్రం 10 ఆంగ్ల పదాలను, వాటి అర్థాలను, స్పెల్లింగ్‌ను విద్యార్థులచే వల్లెవేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25లో ఖాళీ సీట్ల భర్తీ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. 2009 మే 1 - 2011 జూలై 30వ తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. ఇంటర్‌కు సంబంధించి 11వ తరగతిలో సైన్స్+మ్యాథ్స్, గణితం లేకుండా సైన్స్ కోర్సులో ప్రవేశానికి ప్రస్తుతం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. వీరు 2007 జూన్ 1 - 2009 అక్టోబరు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల నుంచి అర్హులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను వారు చదువుతున్న పాఠశాల హెడ్మాస్టర్‌తో ధ్రువీకరింపజేసి నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలని వివరించారు. వీరికి 2024 ఫిబ్రవరి 10వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

ప్రాణాలకు రక్ష

ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. సచివాలయ, ఆరోగ్యశాఖ సిబ్బంది గడపగడపను జల్లెడ పట్టారు. వివిధ రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి వ్యాధి తీవ్రతను బట్టి సత్వరం పెద్దాస్పత్రులకు సిఫార్సు చేసి ప్రాణాలు కాపాడుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 681 వైద్య శిబిరాల ద్వారా 2.52 లక్షల మందికి వైద్య సేవలందించారు.

- జిల్లాలో సత్ఫలితాలిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- 681 వైద్య శిబిరాల ద్వారా 2.52 లక్షల మందికి సేవలు
- చికిత్సలు, ఔషధాలన్నీ ఉచితమే
- సచివాలయ సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ



కూచిపూడి వైద్య శిబిరంలో ప్రాథమిక చికిత్స పొందుతున్న బోడెపోగు శాంసన్ (ఫైల్ ఫొటో)



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి మద్దిపూడి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన బోడెపోగు శాంసన్. ఈ నెల 19వ తేదీ ఆ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ వలంటీర్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం ఇచ్చిన సమాచారంతో వైద్య శిబిరానికి వెళ్లాడు. మొదట అతని పేరు కంప్యూటర్‌లో నమోదు చేసుకుని బీపీ, షుగర్ పరీక్షలు చేసి డాక్టర్ సంగీత వద్దకు పంపారు. ఆమె అతన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఈసీజీ పరీక్ష చేయించారు. రిపోర్టును పరిశీలించి గుండె సమస్య ఉందని, వెంటనే ఒంగోలులోని జీజీహెచ్‌కి వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి తన సొంత కారులో ఒంగోలు జీజీహెచ్‌కి పంపించారు. అతనికి సకాలంలో మెరుగైన చికిత్స అందడంతో ప్రాణాపాయం తప్పింది. 'ఇప్పుడు నేను పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నన్ను కాపాడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్నివేళలా కృతజ్ఞతగా ఉంటాను' అని శాంసన్ అంటున్నాడు.



ఒంగోలు గాంధీనగర్‌లో మందుల సంచులు తీసుకెళ్తున్న వృద్ధ మహిళలు (ఫైల్)

ఒంగోలు టౌన్: మారుమూల పల్లెల్లో సైతం ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తోంది. ఇంటి వద్దనే స్పెషలిస్టు వైద్యులతో సత్వర వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ శిబిరంలో చికిత్సలు పొందిన వారి వివరాలను కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేస్తున్నారు. రోగి పేరు, అతడు ఏ సమస్యతో బాధపడుతున్నాడు, అందుకు గల కారణాలు, గతంలో అతడు పొందిన వైద్యం సహాయం వివరాలు పొందుపరుస్తున్నారు. అలాగే వారి ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి నెలా నాలుగు సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు కొనసాగించనున్నారు. మందులు క్రమం తప్పకుండా వాడేలా చేయడం, రోగి పూర్తిగా కోలుకునేలా చూడడం లాంటి శాశ్వత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 631 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో మొత్తం 2.52 లక్షల మందికి వైద్య సేవలు అందించారు. వారిలో 1,32,429 మంది మహిళలు ఉండగా, 1,19,571 మంది పురుషులు ఉన్నారు. వీరికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన స్పెషలిస్ట్ వైద్యులు 4,800 మందికి మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. 19 మంది టీబీ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. 150 మందిలో లెప్రసీని సస్పెక్ట్ చేశారు. 400 మంది రక్త హీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. 15 మంది చిన్నారులు పోషకాహార లోపంతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి మెరుగైన వైద్య చికిత్సతో పాటు సలహాలు, సూచనలు చేశారు.

3,800 మందిలో కేటరాక్ట్ సమస్య...

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలు కూడా ఏర్పాటు చేశారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 46,083 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 3,800 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయించాల్సిన అవసరం ఉందని నేత్ర వైద్యులు నిర్ధారించారు. 26,800 మందికి కంటి అద్దాలు అవసరం ఉందని గుర్తించారు.



ఒంగోలు సమతానగర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

ఏడు రకాల పరీక్షలు...

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, కఫం, యూరిన్ అనాలసిస్ పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. లివర్ ఫంక్షనల్ టెస్టులు, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షల కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారు. ఆరోగ్య శిబిరాలకు రాక ముందే ప్రజల ప్రొఫైల్‌తో కూడిన కేస్‌షీట్‌ను ప్రింట్ చేసి ఇస్తున్నారు. సచివాలయ పరిధిలో ముందుగా గుర్తించిన వారికి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా గైనకాలజిస్టులతో వైద్య సేవలు అందించడమే కాకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. 172 రకాల ఔషధాలను అందుబాటులో ఉంచి ఉచితంగా మందులు సైతం ఇస్తున్నారు.

ప్రజల నుంచి స్పందన బాగుంది



ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. జిల్లాలో 2.52 లక్షల మందికి ఇప్పటి వరకు వైద్య సేవలు అందించడం జరిగింది. ప్రజలు ఈ శిబిరాలకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. స్పెషలిస్ట్ వైద్యులతో సేవలు పొందుతున్నారు. మెరుగైన వైద్య సేవలతో పాటు ఔషధాలు కూడా ఉచితంగా పొందుతున్నారు.

డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



నా పేరు గోన అంకమ్మ. ఈ మధ్య కాలంలో మోకాళ్లనొప్పులు ఎక్కువగా ఉన్నాయి. స్పెషలిస్టు డాక్టర్ వద్దకు వెళ్లి చూపించుకోమని చాలా మంది చెప్పారు. ఖర్చవుతుందని ఆలోచిస్తున్న పరిస్థితుల్లో మా పూలసుబ్బయ్యకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లి ఓపీ రాయించుకుని స్పెషలిస్టు డాక్టర్‌తో చూపించుకున్నాను. ఉచితంగానే మంచి మందులిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి మంచి కార్యక్రమాన్ని పెట్టినందుకు ధన్యవాదాలు. ఈ శిబిరం ద్వారా మంచి డాక్టర్లతో వైద్య సేవలు లభించాయి.

గోన అంకమ్మ, పీఎస్ కాలనీ, మార్కాపురం

జగనన్న ఆరోగ్య సురక్ష సూపర్ సక్సెస్

- రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం:

రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సూపర్ డూపర్‌గా సక్సెస్ అయిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. నా ఎస్టీ, నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీ ప్రజలంటూ తపన పడే సీఎం.. వారందరి అభివృద్ధితో పాటు ఆరోగ్య పరిస్థితులపై కూడా దృష్టి సారించారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన వైద్యం చేయించుకోలేక పోయిన వారికి కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాటు చేశారని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు దాదాపు 12,300 శిబిరాలు ఏర్పాటు చేశారని, 53.40 లక్షల మంది ఆరోగ్య సురక్షలో పాల్గొన్నారని, 6.75 కోట్ల వైద్య పరీక్షలు నిర్వహించారని, 85 వేల మందిని మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు సిఫార్సు చేశారని మంత్రి వెల్లడించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఎంత ఖర్చయినా భరించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో వైద్య పరీక్షలు చేసిన వైద్యులకు మంత్రి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో మందుల బుక్‌లెట్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

డిసెంబర్ 1 నుంచి పశు ఆరోగ్య సురక్ష ప్రారంభం...

మనుషుల ఆరోగ్యంతో పాటు పశువుల ఆరోగ్యం కూడా ముఖ్యమైందనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి పశు ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించడానికి సీఎం జగనన్న సన్నాహాలు చేస్తున్నారని మంత్రి సురేష్ వెల్లడించారు. పశు సంపద ఆధారంగా రాష్ట్రంలో అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, అటువంటి పశువులను కాపాడుకోవటానికి పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటికి వచ్చిన వ్యాధులకు సక్రమంగా చికిత్స చేయించలేక నామమాత్రపు వైద్యంతో కాలం వెళ్లబుచ్చుతున్నారని అన్నారు. అలాంటి పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు గ్రామాల్లోనే పశు ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో మనుషులకే మంచి వైద్యం అందించలేకపోయారని, పశువుల ఆరోగ్యాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అటువంటి పరిస్థితులు లేకుండా ప్రస్తుతం మనుషులతో పాటు పశువుల ఆరోగ్యాన్ని కూడా పర్యవేక్షిస్తున్న సీఎం జగనన్న మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయనను అందరూ దీవించాలని మంత్రి కోరారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులలో సేవలందించిన వైద్యులు, సిబ్బంది, ఆరోగ్యాన్ని పరిరక్షించే వంటకాలు ప్రదర్శించిన అంగన్‌వాడీలు, అన్ని విధాల సహకారం అందించిన నాయకులకు మంత్రి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సభలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, మండల సచివాలయాల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్ పబ్బిశెట్టి మంజులా శ్రీనివాస్, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, పీఆర్ డీఈ ఎం.సుబ్బారెడ్డి, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజ, ఏఈలు సుబ్బయ్య, శ్రీకాంత్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా విజయం జగన్‌దే

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఆయన చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కావడమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడారు. ఇప్పటి వరకు ఏ పాలకులు చేయని విధంగా అట్టడుగు వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని వివరించారు. అందువలన జిల్లాలో జరిగే సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు అక్రమాలకు పాల్పడినందుకే జైలులో ఊచలు లెక్కబెడుతున్నాడని విమర్శించారు. సానుభూతి కోసం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. చంద్రబాబుకు కోర్టులు శిక్ష విధిస్తే భువనేశ్వరి మాత్రం నిజం గెలవాలంటూ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పేదలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందన్నారు. సిఫార్సులతో నిమిత్తం లేకుండా అర్హతే ప్రామాణికంగా పేదల గడప వద్దకే సంక్షేమాన్ని తీసుకెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు.

చంద్ర గ్రహణంతో ఆలయాలు మూసివేత



ఒంగోలు కేశవస్వామిపేటలో మూసివేసిన దుర్గమ్మ దేవస్థానం, ఆంజనేయస్వామి ఆలయం

ఒంగోలు మెట్రో: చంద్ర గ్రహణం కారణంగా జిల్లాలోని ఆలయాలను శనివారం మధ్యాహ్నం తర్వాత మూసివేశారు. శనివారం రాత్రి చంద్ర గ్రహణం నేపథ్యంలో మహా నివేదన అనంతరం ఆలయాలు మూసివేసినట్లు అర్చకులు తెలిపారు. తిరిగి ఆదివారం ఉదయం ఆలయాలు తెరిచి సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



వల్లూరమ్మ ఆలయంలో గర్భగుడికి తలుపులు వేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా గోవిందమ్మ


నూతన కమిటీని అభినందిస్తున్న పీడీ రవికుమార్

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా కనపర్తి గోవిందమ్మ (పొన్నలూరు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం టీటీడీసీ కార్యాలయంలో సమాఖ్య వార్షిక సమావేశం జరిగింది. ప్రస్తుత అధ్యక్షురాలు నిర్మల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 38 మండలాలకు చెందిన మండల సమాఖ్య లీడర్లు హాజరయ్యారు. సమావేశం అనంతరం నూతన పాలక వర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా గొల్లపాటి వీర నాగేశ్వరమ్మ (పెద్దారవీడు), కార్యదర్శిగా షేక్ జరీనా (కంభం), సహాయ కార్యదర్శిగా ముత్తుపోగు నాతమణి (అర్ధవీడు), కోశాధికారిగా కూడల శ్రావణి (చీమకుర్తి)లను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ప్రాజెక్టు డైరెక్టర్ టి. రవికుమార్ అభినందించారు.

రజక సంఘ ప్రధాన కార్యదర్శి పాల శ్రీను మృతి



ఒంగోలు: ఏపీ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ నాయకుడు మార్రెళ్ల శ్రీనివాసరావు అలియాస్ పాలశ్రీను (52) కన్నుమూశారు. స్థానిక సీఆర్పీ క్వార్టర్స్ డౌన్‌లో నివాసం ఉండే శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీలో చురుకుగా పనిచేసే నాయకుడు. శనివారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హుటాహుటిన స్థానిక ప్రైవేటు వైద్యశాలకు, అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఎమ్మెల్యే బాలినేని సంతాపం వ్యక్తం చేశారు.

వాల్మీకులకు పెద్దపీట


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్, నాయకులు


వాల్మీకి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మలికా గర్గ్, పోలీసు అధికారులు

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వాల్మీకులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని, ఆ సామాజిక వర్గ అభ్యున్నతి కోసం ఎస్టీల జాబితాలో చేర్పించే విధంగా చట్ట సభలో తీర్మానం చేశారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహ ఆవరణలో మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాల్లో మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించే అంశం పార్లమెంటులో తీర్మానం చేయాల్సి ఉందన్నారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చి 5 సంవత్సరాల పాటు కొనసాగే విధంగా చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో కులాల మధ్య చిచ్చుపెట్టి బీసీల అభ్యున్నతికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఎన్నికల ముందు బీసీలకు ఎనలేని వాగ్దానాలు చేసి ఆ తరువాత విస్మరించిన ఘనత వారికే దక్కుతుందని విమర్శించారు. బలహీన వర్గాలకు చెందిన వారి పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని, చదువులకు ఎంత ఖర్చుఅయిన భరాయించటానికి ఆయన సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజక వర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చులు తానే భరాయిస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, ఏకుల ముసలారెడ్డి, బి.బాలచెన్నయ్య, టీ.సీ.హెచ్.చెన్నయ్య, యాపర్తి వీరయ్య, బంగ్లా సుబ్బయ్య, ఎడవల్లి రామయ్య, పర్ల బ్రహ్మయ్య, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


వాల్మీకి జయంతి వేడుకలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


సభలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

మహోన్నత వ్యక్తి వాల్మీకి

ఒంగోలు టౌన్: ప్రపంచ మానవాళికి ఆదర్శంగా నిలిచిన రామాయణ గ్రంథాన్ని రచించిన మహోన్నతుడు వాల్మీకి ప్రబోధించిన మానవతా విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ మలికా గర్గ్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ఉన్నతమైన ఆదర్శాలను బోధించే మధురకావ్యం రామాయణమని కొనియాడారు. ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు హరిబాబు, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను స్థానిక ప్రకాశం భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. నగర మేయర్ గంగాడ సుజాత, వైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కుమార్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె.కనకారావు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

యర్రగొండపాలెం: రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం మండలంలోని వాదంపల్లిలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని, నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఈ కేంద్రాల నుంచి తీసుకెళ్లవచ్చని తెలిపారు. గతంలో అనేక వ్యయ ప్రయాసాలకోర్చి రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడేదని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా తమ ఇంటి ముందుకే చేరుతున్నాయన్నారు. పండిన కందులు పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ముందుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేసిన వాగ్దానం మేరకు ఎస్సీ పాలెంలో రూ. 20 లక్షతో ఏర్పాటు చేసే డ్రైనేజీకి మంత్రి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, పబ్బిశెట్టి మంజులా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు

- మంత్రి ఆదిమూలపు సురేష్


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన కొనసాగిస్తున్నారని, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింపచేసి లబ్ధి చేకూరుస్తున్నారని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం పుల్లలచెరువులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా చేరుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి పనులు చేస్తుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రామాలయం వద్ద జిల్లా పరిషత్ నిధులు రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన మంచి బోరును, ట్యాంకును మంత్రి సురేష్ ప్రారంభించారు. గడప గడపకు కార్యక్రమంలో ఒక మహిళకు కరెంట్ మీటర్ ఏర్పాటు చేసుకునేందుకు మంత్రి తన సొంత నగదు రూ.2500 అందచేశారు. మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ కె.వెంకటయ్య, జెడ్పీటీసీ వాగ్యానాయక్, మండల సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ జానకి రఘు, నాయకులు వెంకటేశ్వర్లు, కాశయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

ఒంగోలులో స్టెమీ ప్రారంభం


స్టెమీపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ శ్రీకాంత్

ఒంగోలు టౌన్: గుండెపోటుకు గురైన మారుమూల ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్యం అందించి ప్రాణాలను కాపాడలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ (ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫ్రాక్షన్) రూపొందించిందని డీఈహెచ్ఎస్ డాక్టర్ ఎస్ఎన్ మూర్తి తెలిపారు. రెండోదశలో స్టెమీని శనివారం ఒంగోలు జీజీహెచ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సెకండరీ హెల్త్ కేర్ సెంటర్లకు చెందిన వైద్యులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని వందమంది వైద్యులు, నర్సులకు శిక్షణ ఇచ్చారు. గుంటూరుకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు శ్రీకాంత్, ఒంగోలు జీజీహెచ్‌కు చెందిన కార్డియాలజిస్టు వెంకటేశ్వర్లు స్టెమీ గురించి శిక్షణ ఇచ్చారు. గుండెపోటు వచ్చినప్పుడు వీలైనంత త్వరగా చికిత్స చేయడం వలన రోగి ప్రాణాలను రక్షించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డాక్టర్ శ్రీకాంత్ చెప్పారు. గోల్డెన్ అవర్లో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు, చీమకుర్తి మెడికల్ సూపరింటెండెంట్ ఆర్. వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు


విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: రైతు శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. కంభం-2 సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు తక్కువ ధరకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాలను నిర్మించడం ద్వారా రైతులకు సేవలు మరింత చేరువ కానున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే అన్నా పేర్కొన్నారు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, సర్పంచ్ పల్నాటి బోడయ్య, అర్ధవీడు ఎంపీపీ వెంకట్రావు, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, సొసైటీ చైర్మన్ ఫజుల్లా రహమాన్, ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, కార్యదర్శి బ్రహ్మయ్య, గంగారపు ఓబయ్య, అంగం నాగేశ్వరరావు, నాగరాజు, హుస్సేన్‌బాస, గంగారపు కృష్ణ, ఆరీఫ్, సంకతాల ప్రసాద్, డిష్‌బాబు పాల్గొన్నారు.

వసతి గృహాలను ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా

కంభం: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మించిన నూతన వసతి గృహాలను శనివారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అర్ధవీడు ఎంపీపీ వెంకట్రావు, గోళ్ల సుబ్బరత్నం పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యం

కంభం: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వ విలేజ్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసిందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు అన్నారు. మండలంలోని రావిపాడులో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లీనిక్‌ను శనివారం సాయంత్రం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను స్థానిక నాయకులు పూలమాలలు, శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, సర్పంచులు వరికుంట్ల భువనేశ్వరి, పల్నాటి బోడయ్య, మహబూబ్ పీరా, ఎంపీటీసీ వరికుంట్ల బాలసుబ్బులు, డాక్టర్ టి. కావ్య, కాంట్రాక్టర్ మధుసుదనరావు (మాధవ), నాయకులు నాగేశ్వరరెడ్డి, వరికుంట్ల పెద్దకోటేశ్వరరావు, గోపాల్‌రెడ్డి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, డిష్ మున్నా పాల్గొన్నారు.

పేదల రక్ష..ఆరోగ్య సురక్ష!


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట ఆరోగ్య రక్ష అని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గత నెల రోజుల నుంచి నిరంతరాయంగా జరుగుతోందన్నారు. స్పెషలిస్టు డాక్టర్లు నేరుగా ఇళ్ల వద్దకు వచ్చి ఉచిత వైద్యసేవలు అందించడం రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి అని అన్నారు. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని మన రాష్ట్రంలో ప్రారంభించి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు కూడా ఉచితంగానే అందిస్తున్నారని పేర్కొన్నారు. సర్జరీలు అవసరమైన వారిని గుర్తించి నెట్‌వర్క్ వైద్యశాలల ద్వారా ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కేపీ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ డాక్టర్ల సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని, వలంటీర్ల ద్వారా ముందుగానే వైద్యశిబిరాల సమాచారాన్ని తెలుపుతున్నామన్నారు. అనంతరం రోగులకు సురక్ష కార్డులు, మందులు అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్ నగేష్, బుస్సెట్టి నాగేశ్వరరావు, ఇన్‌చార్జిలు ఉత్తమ్‌కుమార్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, షెక్షావలి పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అభినందించారు.


మందులు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

చెకుముకి సైన్స్ పోస్టర్ ఆవిష్కరణ

తర్లుపాడు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆవిష్కరించారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి కోటి మోహన్ మాట్లాడుతూ నవంబర్ 10వ తేదీన పాఠశాల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28న రాష్ట్రస్థాయి చెకుముకి ప్రతిభ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడి, హెచ్ఎం శ్రీనివాసరావు, సైన్స్ ఉపాధ్యాయులు రవిశేఖర్, నరసింహారావు, కిశోర్, హేమలత, బ్రహ్మం, అచ్చయ్య, రాజశేఖర్, నాయకులు మురారి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా పొగాకు రైతు దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి

ఒంగోలు సెంట్రల్: పొగాకు రైతుల ఆర్థిక ప్రయోజనాలు పెంపొందించుకొనుటకు అంతర్జాతీయ పొగాకు సమాఖ్య (ఐటీజీఏ) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 28న పొగాకు రైతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బా రెడ్డి అన్నారు. ఒంగోలులోని రెండో పొగాకు వేలం కేంద్రంలో శనివారం పొగాకు రైతు దినోత్సవం నిర్వహించారు. పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బా రెడ్డి మాట్లాడుతూ దేశంలో 4.57 కోట్ల మందికి పొగాకు పంట ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నదని చెప్పారు. దేశంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ రైతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు ఇతర వాణిజ్య పంటలు పండించే వారి కంటే మెరుగ్గా ఉన్నట్లు అసోచామ్ అధ్యయనంలో వెల్లడైనట్లు తెలిపారు. కేంద్ర పొగాకు సంస్థ అధ్యయనం కూడా పొగాకుకు ఇతర పంటల కంటే లాభదాయకమని, ప్రత్యామ్నాయం చూపటం కష్టమని తెలిపిన విషయాన్ని చెప్పారు. ప్రతి సంవత్సరం పొగాకు ఉత్పత్తులపై పన్నుల రూపంలో ప్రభుత్వానికి రూ. 70 వేల కోట్లకు పైగా, అదనంగా పొగాకు ఉత్పత్తుల ఎగుమతి ద్వారా విదేశీ మారకపు ఆదాయం సంవత్సరానికి రూ. 13వేల కోట్లు వస్తున్నట్లు తెలిపారు. అధిక పన్నులు, చట్ట విరుద్ధమైన సిగరెట్ల వలన 2013 నుంచి రూ. 7,500 కోట్లు ఆదాయం తగ్గిందని చెప్పారు. 2013-14 సంవత్సరాల్లో ఎఫ్‌సీవి పొగాకు పంట పరిమాణం 316 మిలియన్ కిలోలు ఉండగా 2021-22 నాటికి 189 మిలియన్ కిలోలకు కుదించారని చెప్పారు. పంట తగ్గింపు వలన 35 మిలియన్ పనిదినాలు కోల్పోయారని వివరించారు. సుస్థిర పొగాకు ఉత్పత్తికి సంఘం తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించి పొగాగులో పురుగు మందుల అవశేషాలు తగ్గించటంపై రైతులు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

సాగు కొనసాగించాలి

విష వ్యర్థాల సేకరణకు కేంద్రాలను ఏర్పాటు చేయటం, నారు పెంచుటకు ట్రే మరియు గ్రీన్ టెక్ పరిజ్ఞానం పై శిక్షణ ఇవ్వటం, బిందు సేద్యం, సుస్థిర భూరక్షణ చర్యలు చేపట్టటం, పంట దిగుబడి పెంచుకొనుటకు తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటం వంటి కార్యాక్రమాలు ఉపయోగించుకోవాలని సుబ్బారెడ్డి కోరారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ), ఫ్రేమ్ వర్క్ కన్వేన్షన్ అన్ టుబాకో కంట్రోల్ (ఎఫ్‌సీటీసీ) సంయుక్తంగా నవంబర్ 20 నుంచి 25 వరకు పనామాలో సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పొగాకు సాగు దారులను భాగస్వాములుగా చేసి వాదనలు విని పొగాకు పరిశ్రమను కాపాడాలని రైతు సంఘం నాయకులు, పొగాకు బోర్డు సభ్యులు కోరారు. పొగాకు సాగుపై ప్రభుత్వం రాయితీలు నిలిపివేసి పొగాకు సాగు నుండి తప్పించాలనే ఆలోచనలు విరమించుకోవాలని కోరారు. పొగాకు బోర్డు సభ్యులు పొద వర ప్రసాదర్ రావు, వడ్డెళ్ల వర ప్రసాద్, అబ్బూరి శేషగిరి, ఎర్రమనేని శేషయ్య, సుబ్బారావు, కేంద్ర అధ్యక్షుడు వీర నారాయణ పాల్గొన్నారు.

కె. ఉప్పలపాడు విద్యార్థులకు మోదీ ప్రశంస పత్రాలు


ప్రశంసపత్రాలు చూపుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొండపి (సింగరాయకొండ): కొండపి మండలంలోని కె. ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంస పత్రాలు వచ్చినట్లు శనివారం పాఠశాల హెచ్ఎం సుసన్నకుమార్ తెలిపారు. గత సంవత్సరం విద్యార్థులతో నిర్వహించిన పరీక్ష పే చర్చా కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు డాక్యుమెంట్ తయారు చేసి ప్రధానమంత్రి కార్యాలయానికి పంపారన్నారు. పదో తరగతి విద్యార్థి ప్రశాంత్, గత సంవత్సరం పదో తరగతి విద్యార్థి అభిలాష్, గత సంవత్సరం హెచ్ఎంగా విధుల్లో ఉన్న ఎం. ప్రభాకర్, ఉపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు, షేక్ ముజఫర్ అహ్మద్, కె. అనూరాధ, తనకు ప్రశంసపత్రాలు వచ్చాయని వివరించారు. వీరిని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.